## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వంగర: మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. పాలకొండ 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

### శస్త్రచికిత్సకు 38 మంది ఎంపిక

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 38 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు సర్పంచ్ గర్బాపు దాలమ్మ తెలిపారు. శిబిరానికి హాజరైన కంటి రోగులకు విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి కూడా ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వెల్లడించారు.

### వృద్ధాశ్రమానికి రూ.లక్ష విరాళం



ఆశ్రమ నిర్వాహకునికి విరాళం అందజేస్తున్న వెంకటరమణ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలోని అనాథ వృద్ధాశ్రమానికి పట్టణానికి చెందిన అందవరపు వెంకటరమణ రూ.లక్షను విరాళంగా అందించి, తన ఔదార్యం చాటుకున్నారు. ఈ మొత్తాన్ని ఆశ్రమం నిర్వాహకులు పి.శ్రీనివాసరావుకు గురువారం అందజేశారు. మరింత మందికి ఆశ్రయం కల్పించడానికి దాతల సహకారం మరువలేనిదని, ఆశ్రమ నిర్వహణలో ఇలా భాగస్వాములు కావడం చాలా ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

### మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రేగిడి: మహిళలను గౌరవించాలని ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ రాములమ్మలు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో వారు గురువారం సమావేశమై గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మహిళల రక్షణ చట్టాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. పురుషులతో సమానంగా స్త్రీలను చూడాలని, ఇంట్లో, పనిప్రదేశంలో ఎక్కడ కూడా మహిళలను వేధించవద్దన్నారు. ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.శశికళ, బంగారమ్మ, నూకాలమ్మ, అమ్మన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరిశీలన



డొంకినవలస రైల్వే ఖానాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బాడంగి: మండలంలోని డొంకినవలస రైల్వేస్టేషన్‌కు తెంటువలస జంక్షన్‌కు మధ్యలోని రైల్వే పట్టాల కింద గతంలో మూసివేసిన రైల్వేఖానాల ప్రాంతాన్ని ఎమ్మెల్యే బేబినాయన గురువారం పరిశీలించారు. గతంలో ఇక్కడ ఉన్న రైల్వేఖానాలను రైల్వే అధికారులు కంకరమట్టితో కప్పివేశారు. దీంతో చెరువుగట్టుకు గండి పడితే ఆ నీరంతా అక్కడి లోతట్టు ప్రాంతాల్లో వచ్చేస్తుందని ఆ ప్రాంత ప్రజలు తెలియజేయడంతో స్పందించిన ఎమ్మెల్యే.. ఆయనే స్వయంగా అక్కడికి వెళ్లి, పరిస్థితిని పరిశీలించడం గమనార్హం. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, కార్యదర్శి సత్యం, తెంటువలస, పెదపల్లి సర్పంచ్‌లు తెంటు చిరంజీవరావు, ఆవు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మహిళలను వేధిస్తే కఠిన చర్యలు


వంగర: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చిరంజీవి పరాగ్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం–2013' పై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ గురువారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించినా, మానసికంగా వేధించినా, లైంగికంగా ఇబ్బంది పెట్టాలనుకున్నా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనీ దుర్గ చట్టాలను వివరించారు. గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్‌రాజ్, ఎంఈవో వై.దుర్గారావు, కార్యాలయ ఏవో లోపింటి త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

### కౌలురైతులకు రుణసాయం

రేగిడి: కౌలురైతు గుర్తింపుకార్డులు ఉండే రైతులకు బ్యాంకులు వ్యవసాయ రుణాలు అందిస్తాయని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని పనసలవలస, కొర్లవలస గ్రామాల్లోని కౌలురైతులకు కల్పిస్తున్న సదుపాయాలు, రాయితీలపై గురువారం అవగాహన కల్పించారు. కౌలురైతుల గుర్తింపు ఈ నెల 10వ తేదీతో ముగిసిందన్నారు.

# 'తల్లికి వందనం' ఒక్కరికే..!

తల్లికి వందనం పథకంపై చంద్రబాబు సర్కారు యూ టర్న్ తీసుకుంది. ఎన్నికల ప్రచార సమయంలో పాఠశాలకు వెళ్లే పిల్లలు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు అదే హామీకి తూట్లు పొడిచేలా జీవో నంబర్ 29 జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పథకం అమలుకు ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం ఒక్కో తల్లికి ఏడాదికి రూ.15 వేలు జమచేస్తామని పేర్కొన్నారు. ఈ లెక్కన ఒక ఇంట్లో ఒక బిడ్డకు మాత్రమే పథకం డబ్బులు ఇస్తారన్న విషయం స్పష్టం కావడంతో విద్యార్థుల తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ప్రకటించిన హామీల పత్రం ఇదే..

### మాయలా ఉంది..



ఇంట్లో ఎంతమంది చదివే పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం పేరుతో రూ.15 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు, లోకేశ్‌లు గతంలో చెప్పారు. ఇప్పుడు అవేమీ కాదంటూ ఒక్కరికే పథకం ఇస్తామనడమనేది అంతా మాయలా ఉంది. మాకు ఇద్దరు పిల్లలున్నారు.. రూ.30 వేలు వస్తాది అనుకున్నాం. వాటిపైనే ఆధారపడి అప్పు చేసి మరీ వారికి నోట్‌బుక్స్, షూస్, కొత్తదుస్తులు కొన్నాం.

–టి.చంద్రకళ, లక్ష్మీపురం, రాజాం మండలం.

### మోసపూరిత హామీలా ఉంది..



మాకు ఇద్దరు పిల్లలు న్నారు. ఇద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాం. ఎన్నికల ముందు చంద్రబాబు ఎంతమంది చిన్నారులు చదివితే అంతమందికి తల్లికి వందనం ఇస్తామన్నారు. ఇప్పుడు ఒకరికి అని అంటున్నారు. అవి కూడా ఇంతవరకు ఇవ్వలేదు. ఇదంతా మోసపూరిత హామీలా ఉంది.

–లావేటి లక్షుంనాయుడు, రేగిడి మండలం.

### అంతా అయోమయం..



తల్లికి వందనం పథకం డబ్బులు వస్తాయన్న ఆశతో మా ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చేర్చాం. ఇప్పుడు ఒక్కరికే పథకం వర్తిస్తుందని చెబుతుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రైవేట్ స్కూల్‌లో చదివిన వారికి ఇస్తారో లేదో తెలీదు.. విద్యా సంవత్సరం ఆరంభమైనా ఇంతవరకు పథకం అమలు చేయలేదు. అంతా అయోమయంగా ఉంది.

–ఎ.అన్నపూర్ణ, బొద్దాం, రాజాం మండలం.

### ఎంతో ఆశగా చూస్తున్నాం..



తల్లికి వందనం పథకం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. పెద్దోడు పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ సత్యసాయి కాలేజీలో ఇంటర్మీడియట్ సెకండియర్, చిన్నోడు సంతకవిటి మండల కేంద్రంలోని వైజ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా పథకం అమలు చేయకపోవడంతో డబ్బులు ఎప్పుడు పడతాయా అని చూస్తున్నాం. ఒకరికి పథకం ఇస్తామనడం సరికాదు.

–గంధ్రేటి శశి, శ్రీహరినాయుడుపేట, సంతకవిటి.

### ఇంతవరకు పథకం అమలు చేయలేదు..



గతంలో పాఠశాలలు ప్రారంభం కాగానే అమ్మ ఒడి పథకం పేరుతో ఈ నగదు అందేది. ఆ డబ్బులు మా పిల్లోడి ఫీజు చెల్లించేందుకు ఉపయోగపడేవి. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఇంతవరకు తల్లికి వందనం పథకం అమలుచేయలేదు. భవిష్యత్తులో ఈ పథకం అమలు ఎలా ఉంటుందో తెలీదు. గత ప్రభుత్వం ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడ చదివినా పథకం ఇచ్చేది.. మా అబ్బాయిని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాం. ఈ ప్రభుత్వం అలా ఇస్తుందో ఇవ్వదో తెలీదు. త్వరగా పథకం డబ్బులు ఇస్తే పిల్లల చదువు ఖర్చులకు సాయంగా ఉండేది. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇవ్వాలి.

జి.ధనలక్ష్మి, వన్నలి, రేగిడి మండలం.

# ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

రాజాం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవోలు యాగాటి దుర్గారావు, బి.ప్రవీణ్‌కుమార్‌లు గురువారం వెల్లడించారు. రాజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 8 మంది, కంచరాం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఐదుగురు, పొగిరి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి నలుగురు, డోలపేట జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ముగ్గురు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.నాగయ్య, వసంతరావు, ఎస్.సత్యనారాయణ, మురళీకృష్ణలు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో ఎ.శంకరరావు(రాజాం హైస్కూల్), పి.డి.భవానీ(రాజాం హైస్కూల్), ఎ.తరుణ్(రాజాం హైస్కూల్), కె.జశ్వంత్(రాజాం హైస్కూల్), జి.ధీరజ్(రాజాం హైస్కూల్), తనూజ(రాజాం హైస్కూల్), టి.లాస్య(రాజాం హైస్కూల్), పి.రమ్య(రాజాం హైస్కూల్) కె.శివ(కంచరాం హైస్కూల్), జె.సాయివర్ధన్(కంచరాం హైస్కూల్), కె.తరుణ్‌కుమార్(కంచరాం హైస్కూల్), ఎస్.నందిని(కంచరాం హైస్కూల్), యు.జశ్వంత్(కంచరాం హైస్కూల్), సీహెచ్ నవ్యశ్రీ(పొగిరి హైస్కూల్) జె.సురేష్(పొగిరి హైస్కూల్), సీహెచ్ హేమంత్‌కుమార్(పొగిరి హైస్కూల్), వి.లిఖిత(పొగిరి హైస్కూల్) ఉన్నారు.

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ తెలిపారు. ఎంపికైన వారిలో ముగడ గ్రామానికి చెందిన జైగణేష్, శివ ఉన్నారు.

రామభద్రపురం: మండంలోని రొంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు, కొట్టక్కి ఉన్నత పాఠశాలకు చెందిన ఒకరు, రామభద్రపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వేణుగోపాలరావు, భాస్కరరావు, కామేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారిలో రొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పత్తిగుళ్ల జ్యోత్స్న నూజివీడు ట్రిపుల్ ఐటీకి, జి.దుర్గాభవాని ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చోడవరపు శ్యామ్‌శ్రీ, రామభద్రపురం పాఠశాలకు చెందిన మత్స జయమాధురి ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



బాడంగి: విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.పురుషోత్తం తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో ఎం.శ్రీకాంత్, పి.ప్రశాంత్, వై.ప్రదీప్, కె.కె.ఎస్.ఎస్. గౌతమ్, పి.వినయ్‌కుమార్, వై.తేజ ఉన్నారు. వీరిలో ఐదుగురు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి, ఒకరు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా, నారసింహునిపేట ప్రభుత్వ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిలో శ్రీకీర్తి, పి.గ్రీష్మ, డి.దీపిక, బి.నిఖిత ఉన్నారు.

రేగిడి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 13 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు తెలిపారు. ఎంపికైన వారిలో రేగిడి హైస్కూల్ నుంచి పాలవలస జ్యోత్స్న, ఖండ్యాం హైస్కూల్ నుంచి గంగు నవ్య, లక్ష్మీపురం హైస్కూల్ నుంచి నెల్లి శేషాద్రినాయుడు, కెంబూరు ప్రవీణ్, మామిడి పూజిత, దేవాది పావనిలు ఎంపిక కాగా, కోడిశ హైస్కూల్ నుంచి కె.నీరజ, ఏపీపురం హైస్కూల్ నుంచి కడగల దీపిక, పోరాం కాంచన, కోట్ల సునీత, బొక్కేల జాన్సీ, సంకిలి హైస్కూల్ నుంచి ఎం.ఎబ్సిబ్, డి.సంజనలు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

# బోధకులు లేని కళాశాల ఎందుకు..?

● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మండల సర్వసభ్య సమావేశంలో ఎంఈవోను ప్రశ్నిస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

రామభద్రపురం: బోధకులు లేని కళాశాల ఎందుకు అని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు ఎంఈవో తిరుమలప్రసాద్‌ను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంఈవో తన నివేదికలు వెల్లడిస్తుండగా, సర్పంచ్ లేచి నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువులు దూరం కాకూడదన్న సదుద్దేశ్యంతో గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. అయితే అందులో చేరిన విద్యార్థులకు బోధించేందుకు ఈ ప్రభుత్వం ఇప్పటికీ బోధకులను నియమించకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మామిడివలస టీడీపీ ఎంపీటీసీ తిరుపతినాయుడు మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లల హాజరు శాతం తగ్గిపోయిందని, ఎందుకు తగ్గిపోతుందని ప్రశ్నించారు. రావివలస సర్పంచ్ సోముల కుమారి మాట్లాడుతూ మూలసెలగాం గిరిజన గ్రామంలో పాఠశాల కూలిపోయే పరిస్థితిలో ఉందని, మిర్తివలస సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ మిర్తివలస పాఠశాలలో సరిపడ సబ్జెక్టు టీచర్లు లేరని తెలిపారు. ఆర్‌టీసీ అధికారి తమ నివేదికలు చదువుతుండగా ఎంపీటీసీ మడక తిరుపతినాయుడు మాట్లాడుతూ రామభద్రపురం ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో తాగునీరు, మరుగుదొడ్ల సమస్య ఉందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాసంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకదృష్టి సారించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి అరుణ, పంచాయతీరాజ్ డీఈ అప్పారావు, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, తహసీల్దార్ ఎ.సులోచనరాణి, ఏవో వెంకటయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, రత్నదీపక్ తదితరులు పాల్గొన్నారు.

### బోధనలో మెలకువలు పాటించాలి

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులంతా బోధనలో మెలకువలు పాటించాలని ఎంఈవోలు బి. ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావులు సూచించారు. స్థానిక పట్టణంలోని శ్రీవత్సల హైస్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇస్తున్న సపోర్టివ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రైనింగ్ పోగ్రాం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాలల్లో ఐసీటీని వినియోగించుకుంటూ విద్యార్థులకు నవీన బోధనా పద్ధతుల ద్వారా విద్యాబోధన అందించాలన్నారు. ఎంఈవోలు, ట్రైనీ మాస్టర్లను సన్మానించారు.

### సమయపాలన పాటించండి



ఉంగరాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రేగిడి: గ్రామసచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో శ్యామలాకుమారి సూచించారు. మండలంలోని ఉంగరాడ, అంబఖండి గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించిన ఆమె.. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విధులు సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

# చురుగ్గా పారిశుధ్య పనులు



తెర్లాంలో బోరుబావి వద్ద బ్లీచింగ్, సున్నం పౌడర్ జల్లుతున్న గ్రీన్‌అంబాసిడర్

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఎంపీడీవో బి.మధుసూదనరావు, ఈవోపీఆర్‌డీ నీలిమ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఈ పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. నేలబావుల్లో క్లోరినేషన్, కాలువల్లో పూడికతీత పనులు, బ్లీచింగ్, సున్నం కలిపిన పౌడర్‌ను కాలువలు, తాగునీటి ప్రదేశాల్లో చల్లించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని వారు తెలిపారు. తెర్లాంలో సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు ఆధ్వర్యంలో పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి పారిశుధ్య పనులు చేపట్టారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి, కమ్మవలస గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి, మధ్యాహ్న భోజనంను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# పశుగ్రాస వారోత్సవాలు ప్రారంభం



పశుగ్రాసం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న మండల పశువైద్యాధికారి నరేంద్రకుమార్

తెర్లాం: రైతుల వద్ద ఉన్న పాడిపశువులకు పశుగ్రాసం మేతగా వేయడం ఎంతో మేలు అని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని విజయరాంపురం, వెలగవలస గ్రామాల్లో పశుగ్రాస వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వారం రోజులపాటు ఈ వారోత్సవాలను పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, పశువులకు పశుగ్రాసం మేతగా వేయడం ద్వారా పాల దిగుబడిని ఘననీయంగా పెంచవచ్చన్నారు. అలాగే పాలలో వెన్నశాతం కూడా బాగా పెరుగుతుందన్నారు. పశుగ్రాస విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ రైతు పాడి పశువులను ఏవిధంగా పెంచాలని, పశుగ్రాసం ఏవిధంగా వినియోగించుకోవాలన్న విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెమలాం పశువైద్య కేంద్రం డాక్టర్ అరుణ, వెటనరీ అసిస్టెంట్(వీహెచ్) డి.తేజ, గ్రామ పశు సంవర్ధకశాఖ సహాయకులు రామినాయుడు, లావణ్య, దివ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

### మెనూ అమలులో లోపాలుంటే చర్యలు



మధ్యాహ్నం భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పీఎం పోషణ గోరుముద్ద పథకం మెనూ అమలులో లోపాలుంటే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో జె.త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని పెరుమాళి గ్రామంలోని ఆదర్శ పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, అటల్ థింకరింగ్ ల్యాబ్, మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రతీ పదార్థం రుచికరంగా ఉండాలని తెలిపారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు.

# వేతనదారులు కోరిన వెంటనే పనులు కల్పించండి

రాజాం:

వేతనదారులు కోరిన వెంటనే పనులు కల్పించాలని, ఎటువంటి అలసత్వం వహించరాదని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో గురువారం సమావేశమైన ఆయన.. పంచాయతీల వారీగా వేసవిలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభవుతోందని, అన్నిచోట్ల రైతువారీ పనులు వేతనదారులకు లభిస్తాయన్నారు. పనులు లేనిచోట వేతనదారులకు ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించాలని, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతులు తమ పొలాల్లో ఉపాధినిచ్చే ఉద్యాన తోటలు పెంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



రాజాం: ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



రేగిడి: ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచనలిస్తున్న ఏపీవో హరనాధరావు

రేగిడి: మండలంలోని తోటపల్లి, మద్దువలస పిల్లకాలువల్లో ఉపాధి హామీ పథకం పనులు చేసి, రైతులకు అండగా నిలవాలని ఏపీవో ఎస్.హరనాధరావు సూచించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో గురువారం సమీక్ష నిర్వహించిన ఆయన.. సాగునీటి పిల్లకాలువల్లో పూడికతీతలు ప్రాధాన్యతగా తీసుకుని పనులు చేయాలని తెలిపారు.

సంతకవిటి: మండల పరిధిలోని గోళ్లవలస పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ జి.పైడితల్లి గురువారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పంటకాలువల్లో ఉన్న రెల్లిగడ్డి, పూడికలను తొలగించి, సాగునీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చూడాలని సూచించారు.



సంతకవిటి: ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

# కుటుంబ నియంత్రణ పాటించాలి

రాజాం: కుటుంబ నియంత్రణ పాటించి, జనాభా నియంత్రణకు తమవంతు సహకారం అందించాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు సిద్ధీశ్వరి, నరేంద్ర కోరారు. మండలంలోని బొద్దాం గ్రామ పీహెచ్‌సీ వద్ద ప్రపంచ జనాభా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పుల మధ్య దూరం ఉండాలని, బాల్యవివాహాలు చేసుకోవద్దని, చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని, చిన్న కుటుంబాలతోనే భవిష్యత్ మనుగడ సాధ్యమని తెలిపారు. కలహాలు లేని కుటుంబాలతో దేశ సౌభాగ్యం సాధ్యమని, అందరూ ఒకరు లేక ఇద్దరు పిల్లలకు మాత్రమే జన్మనివ్వాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. పెనుబాకలో కూడా ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించి, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి సోహినీరాఘవ్

రేగిడి: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సోహినీరాఘవ్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించి, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. అలాగే అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: బొద్దాం పీహెచ్‌సీ వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

### అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది

తెర్లాం: ప్రజలంతా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్బాపు రామారావు అన్నారు. మండలంలోని జగన్నాథవలస గ్రామంలో సర్పంచ్ గొందాల కుమారి ఆధ్వర్యంలో నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి వైద్య బృందం గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉందని, ప్రజలంతా వైద్య సిబ్బంది తెలియజేసిన సూచనలను, సలహాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, రోగులకు వైద్యుల బృందం డాక్టర్ అక్షిత్‌కుమార్, నవీన్‌కుమార్, యశస్విని, అప్పలనాయుడు, అప్పారావు, పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ వసంతరావు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ప్రతినిధి పెనుమత్స అప్పలరాజు, మామిడి రైతుల ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు గొందాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.